పశువైద్యం.. పరిహాసం

- 65 సంవత్సరాల క్రితం నిర్మించిన కారంచేడు పశువైద్యశాల
- శిథిలావస్థకు చేరుకున్నా కనీస మరమ్మతులు చేయని వైనం
- బిక్కుబిక్కుమంటున్న సిబ్బంది, పశుపోషకులు



మందుల గదిలో పైకప్పు పెచ్చులూడిపోవడంతో ఆందోళన చెందుతున్న సిబ్బంది



కారంచేడులో కూలేందుకు సిద్ధంగా ఉన్న పశువైద్యశాల

కారంచేడు: స్థానిక పశువైద్యశాలను 1960లో నిర్మించగా ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుకుంది. అప్పటి నుంచి ఆ పశువైద్యశాలకు ఎలాంటి మరమ్మతులు చేయలేదు. ఎప్పుడు ఎలాంటి ఉపద్రవం ముంచుకొస్తుందో అని అటు సిబ్బంది, ఇటు పశుపోషకులు హడలిపోతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా పై కప్పు నుంచి వర్షం కారుతోంది. ప్రతి గదిలో నీరు చేరుతోంది. దీంతో ఆసుపత్రికి చెందిన కంప్యూటర్లు, రికార్డులన్నీ తడిసిపోతున్నాయి. వాటిని కాపాడుకొనేందుకు సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. 6 దశాబ్దాలు దాటినా ఈ ఆసుపత్రికి ప్రభుత్వం నుంచి ఎలాంటి మరమ్మతులు చేయడానికి నిధులు మంజూరు కాలేదు. దీంతో అప్పుడు నిర్మాణ సమయంలో తీసుకున్న జాగ్రత్తతోనే నేటికీ అది నిలబడి ఉంది. పై కప్పు పెచ్చులు ఊడి అప్పుడప్పుడు రాలి పడుతుంటుందని సిబ్బంది వాపోతున్నారు.

దాతల సాయంతోనే నిర్మాణం

గ్రామానికి చెందిన దాత యార్లగడ్డ సాగర్‌బాబు ఆయన తండ్రి యార్లగడ్డ రామనాథబాబు పేరుపై ఈ పశువైద్యశాల నిర్మించారు. గ్రామంలో అనేక మంది రైతులు తమ పశువుల పోషణ కోసం, వాటి బాగోగుల కోసం దీనిని నేటికీ ఉపయోగించుకుంటున్నారు. ఈ ఆసుపత్రి పరిధిలో కుంకలమర్రు, ఆదిపూడి, కారంచేడు, యర్రంవారిపాలెం గ్రామాలున్నాయి. పై నాలుగు గ్రామాల పరిధిలో మొత్తం సుమారు 3200 గేదెలు, 4250 గొర్రెలున్నాయి. వీటికి నిత్యం వైద్య సేవలను ఇక్కడ నుంచే అందించాలి. ప్రతి రోజూ 50–60 వరకు ఓపీ ఉంటుందని పశుపోషకులు ఈ మేరకు చెబుతున్నారు.



డాక్టర్ గదిలో పైకప్పు పెచ్చులూడిన దృశ్యం

పశువైద్య సేవలకు ఆటంకం

ప్రస్తుత పరిస్థితుల్లో ఇక్కడ నుంచి పశువైద్య సేవలు జరగడానికి చాలా ఆటంకం కలుగుతోంది. పాడి, పశువులకు కేంద్రంగా ఉండే కారంచేడులో రైతులు, పశుపోషకులు ఎక్కువ మంది ఉంటారు. రైతులందరికీ ఇంచుమించు పాడి ఉంటుంది. వీటి సంరక్షణకు అవసరమైన సదుపాయాలు లేకపోవడం వలన పశుపోషకులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో సారి పశువులను ఆసుపత్రి వద్దకు తీసుకురావడానికి కూడా పశుపోషకులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎన్ని సార్లు ఉన్నతాధికారులకు సమస్యలు తెలిపినా అవసరమైన భవన నిర్మాణానికి నిధులు మాత్రం మంజూరు కావడం లేదు. అనేక మార్లు మండల పరిషత్ సమావేశంలో సమస్యను లేవనెత్తి మరమ్మతులకు సంబంధించి తీర్మానాలు కూడా చేశారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకుండా అలాగే ఉంది.

నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం



ఈ గ్రామంలో ఉన్న ఆసుపత్రి భవనం 65 సంవత్సరాల క్రితం నిర్మాణం చేశారు. దీంతో పైకప్పు నుంచి నీరుకారుతోంది. రికార్డులు, కంప్యూటర్లు కూడా తడిచిపోతున్నాయి. వీటిని కాపాడుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నాం. ఒక్కోసారి మేము తడుస్తూ వాటిని కాపాడుకుంటున్నాం. ఉన్న అన్ని గదులూ కారుతున్నాయి. తేళ్ళు, పాములు, విషపురుగులు సంచరిస్తుంటాయి. చాలా భయంగా ఉంటుంది. ఉన్నతాధికారుల అనుమతితో నూతన భవన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతం దాతలు కొంత మంది ముందుకు వచ్చి సుమారు రూ. 10 లక్షల నిధులు సేకరించారు. మరికొంత సేకరించి రూ. 15 లక్షలతో మరమ్మతులు చేపడతామని ముందుకు వచ్చారు. ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేయమంది.

– డాక్టర్ భాగ్యరాజ్, పశువైద్యాధికారి, కారంచేడు

నిధులు మంజూరు చెయ్యాలి



కారంచేడు ప్రాంతంలో పశువులు ఎక్కువగా ఉంటాయి. ఇక్కడ అన్ని వసతులతో కూడిన ఆసుపత్రి ఉంటే అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. గ్రామంలో కొంతమంది పెద్ద రైతులు సహాయం చేయడానికి ముందుకు వస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పశుపోషకులకు అనుకూలంగా ఉండేలా నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చెయ్యాలి.

– యలవల సుబ్బారావు, పశుపోషకుడు, కారంచేడు

పశుపోషకులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు



గ్రామంలో పశుపోషకులకు అనువైన, అన్ని వసతులు కలిగిన పశువైద్యశాల లేకపోవడం వలన ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. పశుపోషకులతో పాటు, వైద్య సిబ్బంది కూడా చాలా అవస్థలు పడుతున్నారు. వేసవికాలం, చలికాలం, వర్షాకాలం అని తేడాలు లేకుండా సమస్యలున్నాయి. శ్లాబ్ కారడంతో పాటు, ఆసుపత్రి ఆవరణలోకి పాములు, తేళ్లు కూడా వస్తున్నాయి.

– పోతిన జగదీష్, కారంచేడు

క్లుప్తంగా

వీరరాఘవ స్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో వీరరాఘవ స్వామి

చీరాల టౌన్: స్థానిక గడియారస్తంభం సెంటర్లో కొలువుదీరిన వేదవల్లి, కనకవల్లీ సమేత శ్రీ వీరరాఘవస్వామి వారికి బుధవారం విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం అర్చకులు దిట్టకవి వాసుదేవాచార్యులు వీరరాఘవస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. విశేష పూజల అనంతరం ప్రత్యేకంగా అలంకరణలో ఉన్న స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చిన్ని కృపారావు పర్యవేక్షించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



ఇసుక ట్రాక్టర్‌తో ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది

వేటపాలెం: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ని జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద తనిఖీల్లో భాగంగా డ్రైవర్ పై కేసునమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



గుంటుపల్లిలో రీ సర్వే పరిశీలించి సూచనలు ఇస్తున్న ఆర్డీఓ

బల్లికురవ: ప్రభుత్వ భూములైన వాగు, కుంట, చెరువు, డొంక, కొండ, దేవాదాయ శాఖ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని చీరాల ఆర్డీవో చంద్రశేఖర నాయుడు హెచ్చరించారు. బుధవారం కొణిదెన రెవిన్యూలోని సర్వే నంబర్ 789 లో వాగు పోరంబోకు భూమిలో గ్రానైట్ వ్యర్థాలు వేస్తున్నారని ఫిర్యాదులు అందటంతో ఆ భూమిని పరిశీలించారు. ప్రభుత్వ భూమిని డంపింగ్ యార్డుగా మార్చటమేమిటని తక్షణమే ఆక్రమణ దారులకు నోటీసులు ఇవ్వాలని తహసీల్దార్ రవినాయక్ ను ఆదేశించారు. అనంతరం గుంటుపల్లి రెవెన్యూలో జరుగుతున్న రీ సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతులు తమ వద్ద నున్న హక్కుపత్రాలను రీసర్వే టీమ్‌కు చూపించి సహకరించాలని కోరారు తహసీల్దార్ రవినాయక్, డిప్యూటీ తహసీల్దార్ ప్రహర్ష, సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం



శిక్షణ నిర్వహిస్తున్న వయోజన విద్య పర్యవేక్షకులు మనోరంజన్

పర్చూరు(చినగంజాం): స్వయం సహాయక గ్రూపు మహిళలల్లో నిరక్షరాస్యులైన వారిని అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వయోజన విద్య పర్యవేక్షకులు మనోరంజన్ అన్నారు. ఉల్లాస్ కార్యక్రమంపై సీసీలు, వీఓఏలు, వలంటీర్‌లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ళు.. అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వయోజనులకు ప్రాథమిక అక్షరాశ్యత, జీవన పర్యంత విద్యావకాశాలను అందించడమే దీని ఉద్దేశమన్నారు. మహిళకు క్రియాత్మక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, జిటల్ అక్షరాస్యతలు అందిస్తామన్నారు.

పశువైద్య శిబిరాలు ఉపయోగించుకోండి



నట్టల నివారణ మందు అందిస్తున్న సర్పంచ్

బల్లికురవ: వైద్యవసతి లేని మారుమూల గ్రామాలకు ఉచిత పశువైద్య శిబిరాలు ఓ వరమని నక్కబొక్కల పాటు సర్పంచ్ ధూళిపాళ్ల రామయ్య అన్నారు. బుధవారం నక్కబొక్కలపాడు, కొణిదెనలో ఉచిత పశువైద్యశిబిరాలు నిర్వహించారు. 1596 పశువులు గొర్రెలకు నట్టల నివారణ మందు, 300 గొర్రెలకు బొబ్బ టీకాలు, 29 పశువలకు గర్భకోశవ్యాధుల పరీక్షలు చేశారు. వైద్యాధికారులు ఆర్. పావని కుమారి, పి. మహేశ్వరరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు ఆహార నియమాలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శాలిని, హస్మప్రియ

స్వర్ణ (కారంచేడు): గర్భిణులు వైద్యులు తెలిపిన ఆహార నియమాలను పాటించాలని స్వర్ణ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాలిని అన్నారు. బుధవారం స్వర్ణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని స్వర్ణ, స్వర్ణపాలెం, జరుబులవారిపాలెం, కొడవలివారిపాలెం, కేశవరప్పాడు, రంగప్పనాయుడువారిపాలెం గ్రామాలకు చెందిన సుమారు 38 మంది గర్భిణులకు ప్రధానంగా ఓరల్ గ్లూకోజ్ టోలరెన్స్ టెస్ట్ (ఓజీటీటీ)లను నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖ ప్రసవం వరకు సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తారన్నారు. డాక్టర్ హస్మప్రియ, ల్యాబ్ టెక్నీషియన్ బయ్యా శంకర్, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసిఫోరా, మల్లేశ్వరి, నాగలక్ష్మి, సౌజన్య, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

పంటలు నమోదు చేసుకోండి



మొక్కజొన్న పరిశీలిస్తున్న ఏవో వెంకటరెడ్డి

మార్టూరు: మండలంలోని రైతులు 2024 రబీ సీజన్లో సాగు చేస్తున్న పంటల వివరాలను స్థానిక రైతు సేవా కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.అంజిరెడ్డి కోరారు. బొల్లాపల్లి, తాటివారిపాలెంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. ప్రస్తుతం శనగ పంట చివరి దశలో ఉన్నందున నీటి లభ్యత సరిగాలేక బెట్టకు వచ్చి తాలుగింజలు వచ్చే అవకాశం ఉందన్నారు. వీఏఏ శ్రీ చైతన్య, రైతు సంఘం నాయకుడు వి. కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి



పర్చూరు నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న గాదె



కారంచేడు నాయకులతో జరిగిన సమావేశంలో గాదె మధుసూదన రెడ్డి

పర్చూరు(చినగంజాం):

పర్చూరు నియోజక వర్గంలో వైఎస్సార్ సీపీని అభివృద్ధి చేసే విషయంలో అంతా భాగస్వాములు కావాలని పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త గాదె మధుసూదన్ రెడ్డి అన్నారు. గుంటూరులోని ఆయన నివాస గృహంలో బుధవారం పర్చూరు, కారంచేడు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పార్టీ ప్రతిష్టను పెంచే విధంగా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త అంకిత భావనంతో పని చేయాలని, తిరిగి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునేంత వరకు పని చేయాలన్నారు. కార్యక్రమంలో పర్చూరు మండల కన్వీనర్ కఠారి అప్పారావు ఎం. వేణుబాబు, జి. భాస్కరరావు, దాసరి వెంకట్రావు, కాకర్లమూడి చిన్నయ్య, జడ అప్పారావు, ముప్పాళ్ళ రాఘవయ్య, కట్టా రత్నంరాజు, వి. లక్ష్మీనారాయణ, వీరయ్య, తోకల కృష్ణమోహన్, జాషువా, కారంచేడు మండల కన్వీనర్ దండా చౌదరి, మండల ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, కొడాలి ధర్మారావు, యార్లగడ్డ శ్రీకాంత్, అహ్మద్, చల్లా సుబ్బారెడ్డి, మండల కోఆప్షన్‌మెంబర్ ముల్లా నూర్‌అహ్మద్, కారుమూడి సుబ్బారెడ్డి, చల్లా అప్పిరెడ్డి, ముఖ్యనాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



గుంతలు పూడ్చివేయిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

చీరాల: జాతీయ రహదారి 216పై రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రూరల్ ఎస్సై అంబటి చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఈపురుపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒంగోలు–దిగమర్రు జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను రూరల్ ఎస్సై తన సొంత నిధులతో పూడ్చివేయించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడటం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ కూడా ఇసుకతో నింపి ఎరుపు స్టిక్కరింగ్ ఉన్న డ్రమ్ములను కూడా ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎస్సై తెలిపారు. రూరల్ ఎస్సై కృషికి ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు చేయకుంటే పోరుబాట



వరి కుప్పలను పరిశీలిస్తున్న రమణారెడ్డి

చీరాల టౌన్: అన్నదాతలు ఆరుగాలం కష్టించి పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తానని చెప్పి తీరా పంట చేతికి అందిన తర్వాత టార్గెట్ పూర్తయిందనే సాకుతో.. ధాన్యాన్ని కొనకుండా ఇబ్బందులకు గురిచేస్తే పోరు తప్పదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కావూరి రమణారెడ్డి అన్నారు. బుధవారం చీరాల మండలంలోని దేవినూతల, కావూరివారిపాలెం. గవినివారిపాలెం గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యం (పురులు) కుప్పలను రైతు విభాగం అధ్యక్షులు పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు తాము పడుతున్న ఇబ్బందులను కావూరి దృష్టికి తీసుకొచ్చారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో వరి కుప్పలు పంట పొలాల్లోనే ఉన్నాయని కూటమి ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా కాలయాపన చేయడం దుర్మార్గమన్నారు. అందరికీ అన్నం పెట్టే అన్నదాతను ఇబ్బందులకు గురిచేస్తే వైఎస్సార్ సీపీ పార్టీ అండగా ఉంటుందన్నారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నదాతలకు అండగా ఉన్నారని.. కూటమి పాలనలో రైతులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయని విమర్శించారు.

అష్టలక్ష్మి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం రేపు



ప్రతిష్ఠా మహోత్సవానికి సిద్ధమైన ఆలయం

పర్చూరు(చినగంజాం): పర్చూరులో అష్టలక్ష్మీ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు బుధవారం తెలిపారు. సుమారు రూ. 4 కోట్లతో ఆలయాన్ని తీర్చిదిద్దామన్నారు. గణపతి సచ్చిదానంద స్వామి, విజయానంద తీర్థస్వామి విచ్చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు.

పురంధరదాసు కీర్తనలు అజరామరం



పురంధరదాసు విగ్రహానికి పూలమాల వేస్తున్న సాహితీవేత్తలు, సాహితీప్రియులు

అద్దంకి: కన్నడ పదో కవితా పితామహుడు పురందరదాసు కీర్తలు పండితుల, పామరుల నోళ్లలో పలుకుతూనే ఉన్నాయని టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు అన్నారు. పురంధర దాసు 461వ ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని పురందరదాసు విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పురందురల వారి కీర్తనలు పండితులకు పామరులకు అర్థమయ్యే విధంగా ఉంటాయని చెప్పారు. అద్దంకిలోని విగ్రహం భారత దేశంలోనే రెండోదని చెప్పారు. నీలంరాజు నాగేశ్వరరావు, జ్యోతి చంద్రమౌళి, మాజీ సర్పంచ్ చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, చెన్నుపాటి రామరాంజనేయులు, ప్రముఖ కార్టూనిస్ట్ బత్తుల బాలూ, జ్యోతి రమేష్ బాబు, మాదాల దానయ్య, షేక్ జాన్ సాహెబ్, అత్తులూరి నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ



బీరువా బహూకరిస్తున్న మార్టూరు రోటరీ క్లబ్ ప్రతినిధులు

మార్టూరు: మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని బబ్బేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి బుధవారం బీరువా బహూకరించారు. మార్టూరు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు పాఠశాల పూర్వ విద్యార్థి అయిన తాళ్లూరి సాంబశివరావు తన సొంత నిధులు రూ. 20,500 ఖర్చు చేసి పాఠశాల లైబ్రరీలో పుస్తకాలు భద్రపరచుకోవడం కోసం అవసరమైన బీరువాను కొనుగోలు చేసి ఉపాధ్యాయ బృందానికి అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, గరిమిడి శ్రీనివాసరావు ఇతర ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరా.. నీకే నీడ కరువా?



నిర్మాణంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయం

అద్దంకి: ఆపద మొక్కులు తీర్చే శ్రీవెంకటేశ్వరునికే నీడ కరువైంది. జీర్ణావస్థకు చేరిన దేవస్థానాన్ని పడేసి, చేపట్టిన నూతన దేవస్థాన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో మూలవిరాట్టు బాలాలయంలోనే ఉన్నాడు. వివరాలు.. పురాతన చరిత్ర కలిగిన అద్దంకి పట్టణానికి వివిధ రాజవంశాలు పాలించాయి. ఆ కాలంలో నిర్మించిన దేవస్థానాలు ఇప్పటికీ ఉన్నా, రెడ్డి రాజుల కాలంలో కాకానిపాలెంలో నిర్మించిన శ్రీపద్మావతి, ఆండాళ్ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం జీర్ణావస్థకు చేరింది. ఈ క్రమంలో కాకానపాలెం వాసులు వెంకటేశ్వరునికి నూతన ఆలయం నిర్మించేందుకు పూనుకున్నారు. అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని కలిసి చెప్పగా, రూ.1 కోటి పాలెంవారి చందాలతో, టీటీడీ నుంచి రూ.2.6 కోట్లు నూతన ఆలయ నిర్మాణానికి 2020లో మంజూరు చేశారు. ఆలయ నిర్మాణ పర్యవేక్షణ కోసం ఐదు మంది స్థానికులు కమిటీగా ఏర్పాటయ్యారు. ఈ ఆలయ నిర్మాణం 2020లో శ్రీ కాళహస్తికి చెందిన యవశేఖర్ అనే కాంట్రాక్టర్ పనులు చేపట్టాడు. పనులను చెన్నైకి చెందిన శిల్పులు చేస్తున్నారు. కాగా గర్భాలయం, పద్మావతి, ఆండాళ్లమ్మవారి ఉపాలయాలు, అర్ధమండపం, ముఖమండపం, ప్రహరీ, ధ్వజస్తంభం ఏర్పాటుతో ఆలయ నిర్మాణ పనులను ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన రాతితో శిల్పులు ఇక్కడే ఉండి చేస్తున్నారు. అయితే కాంట్రాక్టరు మొదట్లో ఆలయ నిర్మాణం శరవేగంగా జరిపినప్పటికీ తరువాత వేగం తగ్గించాడు. ఫలితంగా మూడేళ్లయినా నలభై శాతానికి పైగా పనులు పూర్తికాలేదు.

ఉత్సవాలకు చోటు కరువు..

ఒక వైపు దేవస్థాన నిర్మాణం పూర్తికాక పోగా, దసరా, సంక్రాంతి, తొలిఏకాదశి సమయాల్లో ఇదే ఆలయం ఆవరణలో నిర్వహించే కోలాటం, చెక్కభజన, వంటి వేడుకలకు స్థలం కరువైంది. దేవాలయ శాఖ అధికారుల తీరు వల్లే ఇలా జరుగుతోందని, అధికారులు పట్టించుకుని ఇకనైనా దేవస్థానం త్వరగా పూర్తయ్యేలా చూడాలని పాలెం వాసులు, కమిటీ సభ్యులు కోరుతున్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

జె.పంగులూరు: గర్భిణులు పుష్టికరమైన ఆహారం తీసుకోవాలని పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ బాల రాజేశ్వరి అన్నారు. బుధవారం పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌ఓ భారతి, హెల్త్ ఎడ్యుకేటర్ అనురాధ, ల్యాబ్ టెక్నిషియన్ హరిచందన, స్టాఫ్ నర్స్ క్రాంతి, ఫార్మసిస్ట్ పద్మావతి, సూపర్‌వైజర్ రమాదేవి, హరిబాబు, రాజారెడ్డి పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

అద్దంకి రూరల్: సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో నెల్లూరులో జరుగుతాయని తెలిపారు. తంగిరాల వెంకటేశ్వర్లు, రావులపల్లి కోటేశ్వరరావు, కె. రఘుచంద్, బి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పురుగు మందులతో అనర్థం

అద్దంకి రూరల్: వ్యవసాయంలో పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు కె. ధన్‌రాజు అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాయపాలెం, రామాయపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది నిర్వహించారు. కొర్రపాటి వెంకటకృష్ణ,ఖాజా, వ్యవసాయ విస్తరణాధికారి కోటేశ్వరరావు, పరిటాల నాగరాజు పాల్గొన్నారు.